క్లుప్తంగా

'అమర్నాథ్'లో మంత్రి పూజలు



అమర్నాథ్ యాత్రలో మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ దంపతులు

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అమర్నాథ్ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం గుహలో మంచు రూపంలో ఉండే శివలింగాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న ఆకాంక్షతో ఎంతో శ్రమ, ప్రమాదకర మంచు కొండ చరియలను దాటుకుని శివుడిని దర్శించుకున్నట్లు మంత్రి 'సాక్షి'కి తెలిపారు.

పశు సంపద అభివృద్ధే లక్ష్యం



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

బెళుగుప్ప: వ్యవసాయానికి అనుబంధంగా పశు సంపదను అభివృద్ధి చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని వ్యవసాయశాఖ ఉరవకొండ డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జి. వెంకటేశులు అన్నారు. మంగళవారం మండలంలోని గంగవరం, అంకంపల్లిలో ఏపీ పశుసంవర్ధకశాఖ, శ్రీసత్యసాయి సేవా సమితి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాలను మండల పశు వైద్యాధికారి రమేష్, కళ్యాణదుర్గం పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసగుప్త పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్య నిపుణులు పున్నయ్య, సుధాకర్, నాగబాబు, మంజునాథ్, గోపాలమిత్రలు, పశువైద్య అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



మాట్లాడుతున్న డిప్యూటి కలెక్టర్ వరప్రసాద్

రాయదుర్గం రూరల్: వైఎస్సార్ గృహనిర్మాణ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ జయచంద్ర, సచివాలయ వార్డు అమెనిటీస్‌లకు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మంగళవారం ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. పునాదులు, బేస్‌మెంట్ లెవెల్ , రూఫ్ లెవెల్ నిర్మాణాల్లో ఉన్న లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు నేడు పనులు వేగవంతం చేయాలని, డ్రాప్ అవుట్ అయిన ఆడపిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి తీసుకున్న చర్యలపై ఎంఈఓ నాగమణితో ఆరా తీశారు. అలాగే కరోనా సమయంలో సేవలందించిన 25 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్‌కు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, కార్మికులు వినతిపత్రం అందజేశారు.

మహిళ బలవన్మరణం

గుమ్మఘట్ట: జీవితంపై విరక్తితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన పూసల అంజినమ్మ (45), శ్రీనివాసులు దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు న్నారు. చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసులు నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారమై జీవితంపై విరక్తి చెందిన అంజినమ్మ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి వరండాలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి ఫోన్‌లో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

మద్యం మైకంలో తమ్ముళ్లు!



మద్యం సేవిస్తున్న టీడీపీ నాయకులు

బ్రహ్మసముద్రం: టీడీపీ కార్యక్రమాలకు మద్యం లేనిదే ఎవరూ హాజరు కావడం లేదని ఆ పార్టీ నాయకులు మద్యం పంపిణీకి తెరలేపారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2 వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అందుకు సంఘీభావంగా ఆ పార్టీ ఆదేశాల మేరకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా మహేశ్వర నాయుడు వేర్వేరుగా బ్రహ్మసముద్రం మండలంలో మంగళవారం సంఘీభావ పాదయాత్రలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘీభావ పాదయాత్ర విజయవంతం చేయడానికి టీడీపీ నాయకులు ఏకంగా మద్యం పంపిణీ చేపట్టారు. టీడీపీ కార్యకర్తలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ హంగామా చేశారు.

'జగనన్న సురక్ష' పేదలకు వరం

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



కూడేరు: సర్టిఫికెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి



రాయదుర్గంటౌన్: లబ్ధిదారురాలికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కూడేరు: ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా సంక్షేమ పథకాల లబ్ధికి పేదలు దూరం కాకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. మంగళవారం కూడేరులోని సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తోందన్నారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు మరింత చేరువై ఉచితంగా 11 రకాల సేవలను అందిస్తోందన్నారు. ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని అధికారులకు సూచించారు. అనంతరం 224 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు దేవ, సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ, అగ్రి అడ్వైజరీ మండల చైర్ పర్సన్ నిర్మలమ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణచౌదరి, ఎంపీడీఓ ఎంకెబాషా, తహసీల్దార్ శేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు తుప్పటి హరీష్, క్రిష్టప్ప, రామాంజనేయులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' ప్రవేశపెట్టి ప్రభుత్వ సేవలు పేదలకు మరింత చేరువ చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం రాయదుర్గం పట్టణంలోని 12, 14వ సచివాలయం, 13, 15వ సచివాలయం పరిధిలోని వార్డులకు సంబంధించి మారెమ్మగుడి ఏరియా, ఆత్మకూరు వీధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 520 మందికి వివిధ సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు శ్రీనివాస యాదవ్, ప్రత్యేక అధికారి వరప్రసాద్, కౌన్సిలర్లు పెద్ద వన్నూరుస్వామి, షబ్బీర్, పద్మజ, ఫక్రుద్దీన్, లబ్బా గజాల, డిష్‌గోవిందు, పైతోట సంజీవప్ప, పొరాళ్ల గోవిందరాజులు, కో ఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్/కంబదూరు/బ్రహ్మసముద్రం/రాయదుర్గం రూరల్/ బొమ్మనహాళ్/ గుమ్మఘట్ట/ విడపనకల్లు: సచివాలయంలో ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఫణికుమార్ సూచించారు. కళ్యాణదుర్గం మండలంలోని మానిరేవు, ముద్దినాయనపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొమ్మన్న, సర్పంచ్‌లు చంద్రా నాయక్, నిర్మలమ్మ, ఎంపీటీసీలు వెంకట్రామ్‌నాయక్, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు. కంబదూరు మండలంలోని రాంపురం, పాళ్లూరులో నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో తహసీల్దార్ నయాజ్ అహ్మద్, ఎంపీడీఓ సుధాకర్ రాజు, సర్పంచ్‌లు చెన్నయ్య, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.శెట్టూరు మండలంలోని కనుకూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ నాగమణి, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి, ఎంపీడీఓ మైథిలీ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండలంలోని తీటకల్లు సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ బాలకిషన్ , ఎంపీడీఓ దాసా నాయక్ , సర్పంచ్‌లు రామ్మోహన్ , కవితమ్మ తదితరులు పాల్గొన్నారు. రాయదుర్గం మండలంలోని ఆవులదట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓ కొండయ్య, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ బాబు, నాయకులు శివారెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, గొల్ల మురహరి, పాల్గొన్నారు. అలాగే మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో మండల నోడల్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో జగనన్న కార్యక్రమం నిర్వహించారు.కాగా అనంతపురం నుంచి రాయదుర్గం వైపు వస్తున్న డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్ సభాస్థలికి చేరుకుని జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం, సర్పంచ్ ముక్కన్న, ఎంటీటీసీ వనజాక్షి, తదితరులు పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండలంలోని మారెంపల్లిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీటీసీ ఈరన్న, ఈఓఆర్డీ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఆర్ఐ చంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే విడపనకల్లు మండల కేంద్రంలోని సచివాలయం-2 లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు, తహసీల్దార్ ఈరమ్మ, ఈఓఆర్డీ సత్యబాబు, సర్పంచులు, ఎంపీటీలు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, సర్పంచు ఫణీంద్రగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, హాజరు కావాలన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం రూరల్: ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. వేపరాళ్ల ఎస్సీ మహిళ , కాశీపురం ఎస్సీ జనరల్, ఆవులదట్ల ఎస్టీ మహిళకు రిజర్వేషన్ చేశామన్నారు. పదవతరగతి ఉత్తీర్ణత చెంది, 18 - 35 సంవత్సరాల్లోపు ఉన్న వారు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు 18, 19వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పట్టు పెంపకంతో ఆర్థిక పురోగతి

కుందుర్పి: పట్టు పెంపకంతో రైతులు ఆర్థిక పురోగతి సాధించేందుకు ఆస్కారముందని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉషావర్ధిని సూచించారు.మంగళవారం మండలంలోని రుద్రంపల్లి లో వైఎస్సార్ పట్టుబడి కార్యక్రమం నిర్వహించి మల్బరీ రైతులకు పట్టుగూళ్ల పెంపకం, ప్రభుత్వం రాయితీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెరికల్చర్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ బసవరాజు, రైతులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

- జీటీపీ పనులకు రూ.135 కోట్లు విడుదలపై రైతుల హర్షం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గానికి తలమానికంగా నిలిచిన భైరవానితిప్ప ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి , మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ చిత్రపటాలకు రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. స్థానిక టీ సర్కిల్‌లో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మండల కన్వీనర్ సర్వోత్తమ, కేసీఎస్ ఇన్‌చార్జ్‌లు అర్చన, ఆంజనేయులు, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి, సీనియర్ నాయకుడు సుధీర్, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, కో ఆప్షన్ సభ్యుడు సల్లా మారుతి, నాయకులు బ్రహ్మయ్య, రామచంద్ర, కృష్టారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, గోళ్ల మోహన్‌రెడ్డి, ఉమేష్ రెడ్డి మాట్లాడారు. మంత్రి ఉషశ్రీచరణ్ చొరవతో బీటీపీ కాలువకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందజేయడం గొప్పవిషయమన్నారు. ఇటీవల కళ్యాణదుర్గానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి ప్రాంత రైతుల కష్టాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన రూ.135 కోట్లు విడుదల చేస్తూ జీఓ విడుదల చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. తద్వారా సుమారు 600 మంది రైతులకు పరిహారం అందుతుందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు రూ.80 కోట్లు, సివిల్ వర్కులకు రూ.55 కోట్లు కేటాయించారన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బిక్కిహరి, హనుమంతరాయుడు, ఎంపీటీసీ సతీష్, మంజు, కిరీటి యాదవ్, జోసెఫ్ కిశోర్, హేమ, లత, హబీబ్, రాములతో పాటు పలువురు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డి కళ్యాణదుర్గంలో నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామని, ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వడంపై ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో మంగళవారం నాయకులు సమావేశమయ్యారు. సంఘం గౌరవ అధ్యక్షులు మోహన్ ప్రకాష్, యోగానంద, పట్టణ అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు జమునాథ్, నాయీ బ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడారు. కమ్యూనిటీ భవనానికి నిధులు కేటాయించడానికి కృషి చేసిన మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌కు వారు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆదిమూర్తి, లక్ష్మి నారాయణ, వీరేష్, మంజునాథ్, తిమ్మప్ప, హిమగిరి, వెంకటేశులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


అవగాహన ద్వారానే వ్యాధుల నివారణ



డెంగీ నివారణ మాసోత్సవాల ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: అవగాహన ద్వారానే సీజనల్ వ్యాధుల నివారణ సాధ్యమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సూచించారు.మంగళవారం మండల కేంద్రంలో డెంగీ నివారణ మాసోత్సవాలపై అవగాహన ర్యాలీ, ప్రపంచ జనాభా దినోత్సవంపై ర్యాలీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీ ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డెంగీ నివారణ మాసోత్సవాలపై పోస్టర్లను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారిని ఎమ్మెల్సీ పరామర్శించి బ్రెడ్లు, పండ్లు అందచేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన 108 అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్సీ జెండా ఊపి ప్రారంభించారు. అలాగే 3వ వార్డులో తాగునీటి ఎద్దడి నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాషాకు ఫోన్‌లో ఎమ్మెల్సీ ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచు జయేంద్రరెడ్డి, ఉపసర్పంచు మధుసూదన్‌రెడ్డి, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, ఆదర్శ పాఠశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు రామచంద్ర, తిప్పయ్య, వార్డు సభ్యులు అచ్చనాల మధుసూదన్, మల్లికార్జునరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, శంకర్‌రెడ్డి, పందికుంటశీనా, దేవేంద్ర, ఏసన్న, లాలెప్ప, వైద్యాధికారా సర్దార్‌వలి, డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి, గ్రామకార్యదర్శి శ్రీధర్‌రావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



నెరిమెట్లలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయిస్తూ తీర్మాన పత్రాన్ని అందిస్తున్న విశ్వ

ఉరవకొండ: పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నెరిమెట్లలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయనకు సర్పంచ్ యోగేంద్రరెడ్డి, ఎంపీటీసీ శోభ అధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. సకాలంలో పింఛన్ అందిస్తున్నారా అంటూ అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి పొందారో ప్రజలకు వివరించారు. దేశంలోనే అత్యుత్తమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్నారు. అనంతరం ఇంటి స్థలం లేని 10 మంది లబ్ధిదారులకు సర్పంచ్ యోగేంద్రరెడ్డి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, నాయకుడు రాకెట్ల అశోక్‌తో కలసి మాజీ ఎమ్మెల్యే పట్టాలు అందజేశారు.

జగన్ ప్రభుత్వంలోనే నాయీ బ్రాహ్మణులకు గౌరవం

నాయీ బ్రాహ్మణులు గౌరవంగా బతికేలా సీఎం వైఎస్ జగన్ కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో నాయీబ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అంతకుముందు దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలోని 533-బీ2 లో రూ.కోటి విలువ చేసే 20 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. అందుకు సంబంధించిన తీర్మాన పత్రాన్ని సర్పంచ్ మీనుగలలితమ్మతో కలసి మాజీ ఎమ్మెల్యే నాయీ బ్రాహ్మణులకు అందించారు. కార్యక్రమంలో కొడిగి గోవిందు, ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ నాయకులు బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, నాయీ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు లత్తవరం భీమ్ రాజ్, గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు హనమంతు తదితరులు పాల్గొన్నారు.

చిన్న కుటుంబం చింతలేని కుటుంబం

కళ్యాణదుర్గం/రాయదుర్గం రూరల్/బొమ్మనహాళ్/ఉరవకొండ: చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని ప్రభుత్వ వైద్యులు అన్నారు. కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. వైద్యాధికారులు హేమలత, రూప, ప్రసన్నభారతి మాట్లాడుతూ జనాభా పెరుగుదల దేశ ప్రగతికి అవరోధమన్నారు. అలాగే రాయదుర్గంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట, కొలగానహళ్లి తదితర గ్రామాల్లో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవంపై ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు , విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. వైద్యాధికారులు గీతాభార్గవి, మల్లీశ్వరి, పీహెచ్ఎన్ శ్రీలత, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఉరవకొండ మండలంలోని పెద్దకౌకుంట్ల, రాకెట్ల పీహెచ్‌సీల పరిధిలోని అంతర్జాతీయ జనాభా నియంత్రణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి పీవీ అనికేత్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం రూరల్: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న డొక్కు ముత్తప్ప, గొల్ల చిత్తప్ప మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీరామప్రసాద్ తెలిపారు. కర్ణాటకకు చెందిన 90 ఎంఎల్ హేవర్డ్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు సీజ్ చేశామన్నారు.

పవన్.. నోరు అదుపులో పెట్టుకో





కంబదూరు, కణేకల్లులో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



బొమ్మనహాళ్‌లో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న వలంటీర్లు

కంబదూరు: పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని వలంటీర్లు హెచ్చరించారు. వలంటీర్లపై అనుచిత వాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా మంగళవారం మండల కేంద్రంలో వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పవన్ కల్యాణ్‌ను దిష్టిబొమ్మను స్థానిక చెక్‌పోస్టును నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ ఊరేగిస్తూ అక్కడ దహనం చేశారు. పవన్ కళ్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలి శంకరప్ప, ఎంపీటీసీ మీసేవ కుమార్, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: పవన్‌కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉంతకల్లు క్రాస్ నుంచి బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీగా వెళ్లి పవన్ కళ్యాణ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వలంటీర్లు ఎస్ఐ శివకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, కందేపల్లి రమేష్, వీరన్నగౌడ్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కణేకల్లు: వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండలకేంద్రమైన కణేకల్లులో వలంటీర్లు మండిపడ్డారు. మంగళవారం వైఎస్సార్ సర్కిల్ వద్ద పవన్ కళ్యాణ్ ఫోటోలను దహనం చేశారు. పవన్ కళ్యాణ్ డౌన్... డౌన్ అంటూ వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విడపనకల్లు: పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వాఖ్యలపై వలంటీర్లు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రధాన కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వరకూ పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ, ఊరేగించారు. 42వ జాతీయ రహదారిపై వలంటీర్లు మానవహారంగా ఏర్పడి పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ హనుమంతు, ఎంపీపీ కరణం పుష్పవతి, భరత్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, మాజీ సర్పంచ్ భీంరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా సయ్యద్ జమాలుద్దీన్ ఉరుసు

ఉరవకొండ: స్థానిక వెలిగొండ రోడ్డులోని జామీయా మసీదు సమీపంలో ఉన్న హజరత్ సయ్యాద్ షా జమాలుద్దీన్ ఖాద్రి ఉరుసు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మైనార్టీ విభాగం నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి దర్గాకు ఊరేగింపుగా వచ్చారు. అనంతరం సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, తఖీబాబాల ఆధ్వర్యంలో స్వామికి చాదర్ బహూకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, కోఆప్షన్ సభ్యుడు సలీం, జేసీఎస్ కన్వీనర్ ఆసీఫ్, మోమీన్ జిలాన్, వన్నూర్‌సాబ్, బేల్దార్‌శర్మాస్, వడ్లసలీం, అన్వర్, అయ్యార్ దాదు, జెండాజిలాన్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

కణేకల్లు: స్థానిక మోడల్ స్కూల్‌ను ఎంఈఓ-2 భవానీశంకర్ మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించి పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టండి

కూడేరు: సామాజిక తనిఖీని పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సామాజిక బృందంతో సామాజికి తనిఖీ నిర్వాహణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవ, సోషల్ ఆడిట్ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ వెంకటేశ్వరనాయక్, ఏపీఓ తులసీ ప్రసాద్, పీఆర్ ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పిల్లల ఉన్నత చదువులే లక్ష్యం

కూడేరు: గ్రామీణ బాలబాలికలు ఉన్నత చదువులను అభ్యసించేందుకు ప్రభుత్వం మండలానికి ఒక జూనియర్ కళాశాలను మంజూరు చేసిందని స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ చౌదరి అన్నారు. మంగళవారం ఆయన తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీపీ నారాయణరెడ్డితో కలసి జూనియర్ కళాశాల ఏర్పాటుకు మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి దేవాలయం వద్ద సర్వేనంబర్ 535లో ప్రభుత్వ భూమి, హెచ్చెల్సీ క్వార్టర్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో సేతుమాధవ్, వైఎస్సార్‌సీపీ నేతలు తుప్పటి హరీష్, రామాంజనేయులు, గంగాధర్, భాస్కర్ రెడ్డి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

బొమ్మనహాళ్: అప్పులబాధ భరించలేక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శంకరబండ వన్నారెడ్డి (30) కొంతకాలంగా వన్నారెడ్డి కౌలుకు భూమిని తీసుకొని వివిధ రకాల పంటలు సాగు చేస్తుండేవాడు. పంట సాగుకోసం, ఆరోగ్య ఖర్చుల నిమిత్తం బయట వ్యక్తుల వద్ద అప్పులు ఎక్కువయ్యాయి. అవి తీర్చేమార్గం లేక ఇంటి ఆవరణలోనే రేకులషెడ్డుకు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమార్తై ఉంది.